# విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు

## – భమిడిపాటి కృష్ణమూర్తి

లోక కళ్యాణకారి, కలహభోజనుడు భూలోక సంచారం చేసి ఇంద్రుడికి ఒక రిపోర్టు సబ్‌మిట్ చేశాడు. ఆ రిపోర్టులో నారదుడు వాడిన అనేక శబ్దాల అర్థాలు తెలియక తికమక పడుతూ నారదుడి వంక ప్రశ్నార్థకంగా చూశాడు ''ఏమిటీ గోల?'' అన్నట్టు.

నారదుడేం తక్కువ తిన్నాడా? తాను నేర్చిన ''యస్, నో, ఆల్ రైట్'' పాండిత్యంతో ఆ పదాలన్నీ ఇంగ్లీషు పదాలనీ, వాటిని యధాతథంగా సేకరించుకొచ్చాననీ చెప్పాడు.

అసలు ప్రశ్న- ఆ రిపోర్టు అర్థం కావాలంటే ఇంగ్లీషు వచ్చిన వాడు కావాలి. అయితే అలాంటివాడు ఒక్కడూ కనబడలేదు. అందువల్ల ఇంగ్లీషు నేర్చుకునేందుకు స్వర్గం నుండి ఒకర్ని భూలోకంలోకి పంప నిశ్చయించుకున్నారు. ఎవరిని పంపాలని తర్జనభర్జనలు జరుగుతుండగా నారదుడు మెల్లగా ఓ ప్రముఖ కవిగారి ముద్దుల కొడుకు విష్ణుశర్మ పేరును సజెస్ట్ చేశాడు.

ఇదివరకే 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' చదివి (ఆఫ్‌కోర్స్ ఫెయిల్ అయ్యాడు. అది వేరే విషయం అనుకోండి) వుండడంవల్ల ఆయనకు భూలోకం వెళ్లక తప్పలేదు. విష్ణుశర్మను పంపడానికి నిశ్చయమైంది. ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఏ దేశం పంపాలని ఆలోచనలో పడ్డారు. ఇంద్రుడి సభానిర్వాహక మండలి ముఖ్య సలహాదారు, సంస్కృత భాషా నిష్ణాత, జర్మన్ పండితుడు మాక్స్ ముల్లర్ మహాశయుడు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.


''విష్ణుశర్మని ఇండియా పంపమని''. ఇండియా భూలోక స్వర్గం అని మాక్స్‌ముల్లర్ అబ్జర్వేషన్. దాంతో ఆయనను ఇండియా పంపడానికి నిర్ణయం జరిగింది. ఇండియాలో ఏ స్టేటుకు పంపాలి అన్నది తరువాతి ప్రశ్న. ఉత్తరాది రాష్ట్రాలలో ఇంగ్లీషుకు చుక్కెదురని, అందువల్ల వాళ్లు ఇంగ్లీషుని కేర్ చేయరని తెలిసింది. ఇహపోతే దక్షిణాదినికూడా రెండు రాష్ట్రాలలో ఇంగ్లీషుకు అంతగా ఆదరణలేదు. యాతావాతా రెండు రాష్ట్రాలు మిగిలాయి. అందులోనూ ఒక రాష్ట్రంలో ప్రాంతీయాభిమానం మెండుగా వుండడంచేత సంస్కృతాంధ్రాలు తప్ప ఏ ఇతర భాషారాని విష్ణుశర్మని ఆంధ్ర రాష్ట్రానికి పంపే ఏర్పాట్లు చేశారు.

తప్పనిసరిగా ప్రయాణానికి మూటాముల్లే సర్దుకోవాలని బయలుదేరాడు.

విఘ్నేశ్వరుడి పెళ్లికి అన్నీ విఘ్నాలే అన్నట్లుగా ఏపీలో ఎవరి దగ్గర ఇంగ్లీషు నేర్చుకోవాలన్న ప్రశ్న తలెత్తింది.

పాపం గురజాడవారికి తమ మానస పుత్రుడు గిరీశం గురించి తెలుసుకోవాలని వుంది. అందువల్ల విష్ణుశర్మకు కామ్‌గా గిరీశం ఎడ్రెస్ ఇచ్చి పంపారు. అయితే నారదులువారు అసలు రహస్యాన్ని తెలుసుకుని చిన్నగా నవ్వి ''ఇదిగో విష్ణుశర్మా! గిరీశంగారి దగ్గర పాఠాలు మాత్రం నేర్చుకో. జాగ్రత్త. ఆయన అసలే ఏంటీ నాచ్ మూమెంట్‌లో తలమునకలుగా ఉంటాడు'' అంటూ హెచ్చరించాడు. ''అందునా హైదరాబాద్‌లో'' అని ముగిస్తూ.

విష్ణుశర్మ బాధ్యత లగేజ్‌తో మనస్సు గుర్రం ఎక్కి ఆఘమేఘాలమీద ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నాడు. హైటెక్ (నిర్మాణంలో ఉన్న) హైదరాబాద్ సిటీ లైఫ్ ఆయనకు ఊపిరాడనీయలేదు. చచ్చీచెడీ తన దగ్గరున్న అడ్రెస్‌తో గిరీశం ఉన్న చోటుకి చేరుకున్నాడు. అదొక పెద్ద కాంపౌండ్. ఆ మధ్యలో పెద్ద పెద్ద భవనాలు. మైదానంలో పిల్లలు యూనిఫారంలో డ్రిల్ చేస్తున్నారు. విష్ణుశర్మకు ఆశ్చర్యంగా ఉంది. మెల్లగా, భయంభయంగా గేటు దగ్గరున్న ప్యూన్‌ను ఉద్దేశించి ''ఆర్యా! మహారాజశ్రీ గిరీశంగారెక్కడ ఉందురో చెప్పగలరా?'' అన్నాడు.



దానికి వాడు ఆయనవంక పల్లెటూరు బైతును చూసినట్లు చూసి ''ఇదర్ మహారాజ్ ష్రీ గిరీషం కోయీ నహీహై'' అని తానన్నదేమిటో అర్థంకాక అయోమయంతో నిలబడ్డ విష్ణుశర్మని చూసి ఆలోచించి బుర్ర గోక్కుంటూ ''అచ్ఛా...అచ్ఛా... ప్రిన్సిపాల్ సాబ్ ఉదర్ బడా కమ్రేమే హై. ఉదర్ చలో'' అని కరుణించాడు.


ప్రిన్సిపాల్‌గారి బిళ్ల బంట్రోతు విష్ణుశర్మను ఒక పట్టాన లోనికి పోనీయలేదు. గురజాడ వారిచ్చిన రికమెండేషన్ లెటర్ చూసిన తరువాత ఆయనను లోనికి రానిచ్చాడు గిరీశం.

విష్ణుశర్మ తాను వచ్చిన పని చెప్పాడు. గిరీశం తన పేరు స్వర్గం దాకా పాకినందుకు సంతోషించాడు.

''పెద్దవారు మీముందు చెప్పుకోకూడదనుకోండి. అయినా అసలు నాతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్ అండి. అందువల్ల మరొకరు అయిదునెలల్లో చెప్పే చదువు నేను ఒక్క నెలలోనే చెప్తాను'' అన్నాడు గిరీశం. ''మరో విషయం ఇదొక పెద్ద కాన్వెంట్ స్కూలు. ఇందులో పిల్లలకు సీటు దొరకాలంటే పెళ్లి చేసుకునే ముందరే సీటు రిజర్వు చేసుకోవాలి. బట్ మీకు స్పెషల్ రికమెండేషన్ అదీ మా తండ్రిగారి నుండి వుంది కనుక వెంటనే సీటు ఇస్తున్నాము'' అన్నాడు. అందులో చాలా భాగం విష్ణుశర్మకు అర్థంకాలేదు. అయినా తన పెద్దతనానికి భంగం రాకుండా తలూపాడు.

గిరీశం కాలింగ్‌బెల్ నొక్కాడు. ఒక బంట్రోతు రావడం, ఇదంతా విష్ణుశర్మకు గారడీలా ఉంది.

''చూడండి విష్ణుశర్మగారూ! వెధవ తెలుగు నాకంతగా రాదు (వెధవ తెలుగు అని ఒక ప్రఖ్యాత కవి, విమర్శకులు తన ఉపన్యాసంలో అన్న మాటలు) ఇక్కడ మా ఈ హోలీ కాన్వెంట్‌లో చిలకమర్తివారి చిన్నవాడు ఉన్నాడట. అతడు డా.గణపతి. శ్రీ రఘురామ చారు తులసీ




దళదామ అన్న ఒక్క పద్యం మీద (ఒక్క లైనే) లండన్‌లో థీసిస్ చేసి అమెరికాలో సబ్‌మిట్ చేసి డాక్టరేట్ పొందాడు. ఆయన క్లాసుకు మిమ్మల్ని పంపుతాను.'' బంట్రోతు వెంట కసాయివాడివెంట మేకపిల్ల వెళ్లినట్లు వెళ్లాడు.

క్లాసు రూము చాలా హుందాగా ఉంది. టీవీ, వీసీ ఆర్, మైక్, బ్లాక్‌బోర్డ్. ఇలా ఇంద్రసభలా ఉంది. అది చూసి (అలంకరణ) విష్ణుశర్మ డంగైపోయాడు.

ఆ క్లాసులో డా. గణపతి తెలుగు పిల్లలకు (తెలుగు క్లాసు)-చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ ఎక్స్‌ప్లైన్ చేస్తున్నాడు. మధ్యలో ఆపిన ప్యాన్‌మీద మండిపడి విష్ణుశర్మ నుండి ఆయన వచ్చిన వైనం తెలుసుకుని క్లాసులో కూర్చోమన్నాడు. తన పాఠం ప్రారంభించాడు.

''చేతిలో వెన్నముద్ద-బటర్ ఇన్ హ్యాండ్
చెంగల్వ పూదండ-అదొక టైప్ ఫ్లవర్ గార్లెండ్
బంగారు మొలతాడు-గోల్డెన్ మొలతాడు''

ఇలా తెలుగు పద్యాన్ని తెలుగు క్లాసులో తెలుగు రావాల్సిన విద్యార్థులకు డా. గణపతి ఎక్స్‌ప్లైన్ చేస్తున్నాడు.

''చిన్నికృష్ణుని-స్మాల్ కృష్ణ
చేరికొలుతు-ఇప్పటిలా అంటే కిలోలు, లీటర్లులా అప్పుడు షేర్లు (శేరులు) ఉండేవి. గోల్డుతో వున్న కృష్ణుడిని షేర్లతో కొలిచారు'' అని చెప్తున్నాడు.

విష్ణుశర్మకు తాను ఏ భాష వింటున్నాడో అర్థం కావడంలేదు. తాను ఏం నేర్చుకోవాలో తెలియలేదు. ఎలా నేర్చుకోవాలో దిక్కు తోచలేదు. తెల్లమొహం వేసుకుని చూస్తుంటే- ''ఓ పెద్దమనిషీ! నీకీ పోయెం అర్థం కాలా?'' అన్న మాటకు ఉలిక్కిపడ్డాడు విష్ణుశర్మ. పిల్లలంతా నవ్వారు. ''సరేలే. నీకు ఏబీసీడీల నుంచి చెప్పాలి కదా''

''ఏ ఫర్ యాపిల్...'' అని విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు ప్రారంభమయింది.

ఇంక ఆయనకు చిన్ని కృష్ణుణ్ణి చేరి (షేర్లలో) కొలిచే విధం ఎప్పటికి అర్థం అవుతుందో పాపం.

★